క్లుప్తంగా

జగనన్న విద్యా కానుక కిట్లు సిద్ధం

అవనిగడ్డ: పాఠశాలలు సోమవారం నుంచి ప్రారంభం కానుండటంతో అన్నీ సిద్ధం చేశారు. గతంలో ఎంఈఓ కార్యాలయాలకు వచ్చిన టెక్స్ట్ బుక్స్‌ను ఆయా పాఠశాలలకు పంపిణీ చేశారు. మండలంలో ఈ ఏడాది 2,280 మంది విద్యార్థులు ఉన్నట్టు ఎంఈఓ ఎస్. శివ శంకరరావు తెలిపారు. వీరందరికీ తొలిరోజునే విద్యాకానుక కిట్లు, టెక్స్ట్ బుక్స్ అందజేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని చెప్పారు. మారిన 9వ తరగతి టెక్స్ట్ బుక్స్ మినహా అన్ని తరగతులకు టెక్స్ట్ బుక్స్ పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని వివరించారు.

లంకమ్మకు మొక్కుబడులు

అవనిగడ్డ: దివిసీమ భక్తుల కొంగు బంగారంగా పూజలందుకుంటున్న లంకమ్మ అమ్మవారికి ఆదివారం పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. కొత్త ఎడ్లంకకు చెందిన అలపర్తి గోపాలకృష్ణ కుటుంబ సభ్యులు మొక్కుబడుల సందర్భంగా ఏర్పాటు చేసిన డప్పు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ఘటం బిందెలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

చల్లపల్లి నుంచి రేపల్లెకు ఆర్టీసీ సర్వీసు

అవనిగడ్డ: చల్లపల్లి నుంచి రేపల్లె రైల్వేస్టేషన్‌కు ఆర్టీసీ సర్వీసును సోమవారం నుంచి నడుపుతామని డిపో మేనేజర్ కె. హనుమంతరావు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 6.30, 8.10, 12.10, 2.45, సాయంత్రం 4.45, 6.35, రాత్రి 9.30కి బస్సు సర్వీసు ఉంటుందని చెప్పారు. అలాగే రేపల్లె నుంచి చల్లపల్లికి ఉదయం 5.20, 7.20, 9.10, మధ్యాహ్నం ఒంటి గంట, సాయంత్రం 3.45, 5.45, రాత్రి 7.45కి బస్సు సర్వీసును నడుపుతామని వివరించారు.

ముగిసిన అమ్మగారమ్మ జాతర

రేమాలవారిపాలెం(నాగాయలంక): గ్రామంలోని చోడిశెట్టి అమ్మగారమ్మ దేవస్థానంలో వార్షిక జాతర మహోత్సవం ఆదివారం ముగిసింది. జల్ది నుంచి తరలించిన అమ్మగారి ఘటాలకు శనివారం రాత్రంతా గ్రామోత్సవం నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున ఘటాలు గుడికి చేరుకోవడంతో సంప్రదాయ రీతిలో గుడి జాతర జరిపారు. ఈ సందర్భంగా చోడిశెట్టి వంశీయులు, భక్తులు చద్ది నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కమిటీ చైర్మన్ చోడిశెట్టి పెదబాబు, పెద్దలు చోడిశెట్టి మాణిక్యాలరావు తదితరులు పర్యవేక్షించారు.


కార్నియాల సేకరణ



తలశిల రాధిక (ఫైల్)

నాగాయలంక: నాగాయలంక 11వ వార్డుకు చెందిన తలశిల రాధిక (45) శనివారం రాత్రి మృతిచెందారు. ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు విజయవాడలోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేశారు. ఆమె భర్త తలశిల రాఘవరావు (కర్రీ పాయింట్ రాఘవ), కుమారులు రవికిరణ్, లక్ష్మీనారాయణ, ఇతర కుటుంబ సభ్యులు స్వచ్ఛందంగా నేత్రదానానికి ముందుకువచ్చారు. మండల నేత్ర దాన మోటివేటర్స్ తలశిల రఘుశేఖర్, కె.నారాయణల సహకారంతో ఆస్పత్రి కంటి వైద్య నిపుణుడు డాక్టర్ ప్రవీణ్ కుమార్ బృందం మృతురాలి కార్నియాలు సేకరించి తీసుకువెళ్లారు. తమ ద్వారా ఇప్పటి వరకు 176 మంది నుంచి కార్నియాలు సేకరించామని రఘుశేఖర్ తెలిపారు.

నిత్యావసర సరుకులు వితరణ



మచిలీపట్నంటౌన్: స్థానిక ఈడేపల్లిలోని సత్య సాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం సత్యసాయి మందిరంలో పేదలకు నిత్యావసర సరుకులను అందజేశారు. సత్య సాయిబాబా భక్తులు వారి ఇళ్ల వద్ద ఆహార పదార్థాలను తీసుకువచ్చి 35 మంది పేదలకు అన్నదానం చేశారు. అనంతరం సత్యసాయి అమృత కలశాలను పంపిణీ చేశారు. సత్య సాయి సేవా సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయకుమార్, మహిళా ఇన్‌చార్జి డి. కాళికాదేవి, టి. సాయికృష్ణ చైతన్య, పి. వరప్రసాద్ పర్యవేక్షించారు.

బాటసారులకు రస్నా పంపిణీ



మచిలీపట్నంటౌన్: నగరంలోని ఖొజ్జిల్లిపేట కెనడీరోడ్డులో బాటసారులకు ఆదివారం చల్లటి రస్నా, మజ్జిగ పంపిణీ చేశారు. గణపతి నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు ఉదయగిరి శ్రీనివాస్, యండపల్లి శ్రీనివాస్ జ్ఞాపకార్థం సభ్యులు బాటసారులకు వీటిని అందజేశారు.

నేటి నుంచి బడిగంటలు

- పంపిణీకి సిద్ధమైన జగనన్న విద్యా కానుక కిట్లు
- బందరు నియోజకవర్గంలో పాఠశాలలకు చేరిన 18,813 కిట్లు, 1,43,368 పుస్తకాలు
- రాగిపిండి, బెల్లం పొడి సరఫరా





పునఃప్రారంభానికి సిద్ధమైన రుస్తుంబాద బాలుర పాఠశాల ; పాఠశాలలకు తరలి వెళుతున్న జగనన్న కిట్లను పరిశీలిస్తున్న ఎంఈఓ దుర్గాప్రసాద్

మచిలీపట్నంటౌన్: పాఠశాలల పునఃప్రారంభానికి అంతా సిద్ధం చేశారు. ఇప్పటికే అభివృద్ధి చేసిన పాఠశాలలను వేసవి సెలవుల అనంతరం తిరిగి సోమవారం తెరిచేందుకు ఆయా పాఠశాలల సిబ్బంది ముస్తాబు చేశారు. పాఠశాల తెరిచిన రోజే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేసేందుకు సిద్ధం చేశారు. ఇవి ఇప్పటికే ఆయా పాఠశాలలకు చేరాయి. విద్యార్థులకు సోమవారం వీటిని అందజేయనున్నారు. వేసవి ఎండ తీవ్రత దృష్ట్యా సోమవారం నుంచి వారం రోజుల పాటు ఉదయం 7.30 నుంచి 11.30 గంటల వరకు పాఠశాలలను నిర్వహించనున్నారు. బడి తెరిచిన అనంతరం విద్యార్థులకు రాగి జావ, ముగిసిన అనంతరం మధ్యాహ్న భోజనం పెట్టి ఇంటికి పంపనున్నారు. నియోజకవర్గంలో ఉన్న 149 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పంపిణీ చేసేందుకు గానూ 18,813 జగనన్న విద్యా కానుక కిట్లు పాఠశాలలకు చేరాయి. అలాగే 1,43,368 పాఠ్య, నోట్ పుస్తకాలు పంపిణీకి పాఠశాలలకు చేరాయి. ప్రతి పాఠశాలలోనూ 100 శాతం విద్యార్థులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. మచిలీపట్నం మండలంలో 64 ప్రైమరీ, 11 యూపీ, 11 జిల్లా పరిషత్, రెండు ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అలాగే నగర పాలక సంస్థ పరిధిలో 36 ప్రైమరీ, మూడు యూపీ, ఏడు, హైస్కూళ్లు, రెండు ఎయిడెడ్ ప్రైమరీ, రెండు ఎయిడెడ్ యూపీ, నాలుగు ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. అలాగే చిలకలపూడి వరలక్ష్మీ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మైనార్టీ ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌తో పాటు రుద్రవరం గురుకుల పాఠశాల, వలందపాలెం బాలికల పాఠశాల, రెండు మదరసాలు సోమవారం నుంచి తెరుచుకోనున్నాయి.

కోడూరు మండలంలో..

కోడూరు: మండలంలోని 45 ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ పాఠశాలల్లో చదువుతున్న 2,612 మంది విద్యార్థులకు సోమవారం జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేస్తామని ఎంఈఓ టీవీఎం రామదాసు ఆదివారం తెలిపారు. సోమవారం నుంచి పాఠశాలలను పునఃప్రారంభించి, ప్రతి విద్యార్థికి తొలి రోజే జేవీకే కిట్లను అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలను కూడా ఇప్పటికే ఆయా పాఠశాలల్లో పంపిణీకి సిద్ధంగా ఉంచామని, ప్రతి విద్యార్థికి ఉత్తమమైన విద్యా బోధన చేసేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో విద్యా శాఖ ఆదేశాల మేరకు ఈ నెల 17వ తేదీ వరకు ఉదయం 7.30 గంటల నుంచి 11.30 గంటల వరకు మాత్రమే తరగతులను నిర్వహిస్తామని, అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు ఈ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. అనంతరం బదిలీలపై కోడూరు మండలానికి వచ్చిన ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఎమ్మార్సీ కార్యాలయం నుంచి జేవీకే కిట్లను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు అందించారు.

ఉపాధ్యాయుల కొరత లేదు



పాఠశాలల్లో ఈ ఏడాది ప్రారంభం నుంచే ఉపాధ్యాయుల కొరత లేకుండా చర్యలు తీసుకున్నాం. ఉపాధ్యాయుల బదిలీలు పూర్తి కావడంతో అన్ని పాఠశాలల్లో పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులను నియమించాం. బదిలీ అయిన ఉపాధ్యాయులు విధుల్లో చేరతారు. ప్రతి పాఠశాలలోనూ రెగ్యులర్ ఉపాధ్యాయుడు ఉండి పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నాం. మునుపెన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ఇది సాధ్యమైంది.

– దుర్గాప్రసాద్, ఎంఈఓ, మచిలీపట్నం

నేడు మల్లవోలులో జగన్న విద్యా కానుక కిట్ల పంపిణీ

గూడూరు: పాఠశాలల పునః ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న జగనన్న విద్యా కానుక కిట్ల జిల్లా స్థాయి పంపిణీ కార్యక్రమాన్ని గూడూరు మండలం మల్లవోలులో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్, జిల్లా కలెక్టర్ పి.రాజాబాబులు సోమవారం ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను సమగ్ర శిక్షా అభియాన్ ఏపీసీ ఎ.శేఖర్, ఏఎంఓ ఆర్.శ్యాంసుందరరావు, సీఎంఓ జి.గోపాలరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, ఎంపీపీ సంగా మధుసూదనరావుతో కలిసి ఆదివారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మోటేపల్లి రత్నారావు, పర్లం పెదబాబు, తలుపుల వెంకట కృష్ణారావు, బొర్రా సాంబయ్య, దాసరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పొట్లపాలెంలో గ్రామ సభ

కోనేరుసెంటర్: పొట్లపాలెం పంచాయతీ కార్యాలయం ఆవరణలో సోమవారం ఉదయం 10.30 గంటలకు గ్రామ సభ నిర్వహిస్తామని పంచాయతీ కార్యదర్శి నాగజ్యోతి తెలిపారు. స్వమిత్వ రీ సర్వే జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్షా పథకంలో భాగంగా గ్రామ కంఠం అబాది ఏరియా ఆస్తుల ముసాయిదా జాబితాను పొట్లపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో, కొత్తపూడి సామాజిక భవనంలో ప్రదర్శించామన్నారు. సదరు జాబితాలో అభ్యంతరాలు ఉంటే గ్రామ సభలో డెప్యూటీ తహసీల్దార్‌కి రాత పూర్వకంగా తెలియ చేయవచ్చని చెప్పారు. గ్రామ సభకు గ్రామస్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

విజ్ఞానం పెంపునకు గ్రంథాలయాలు దోహదం





జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ప్రశంసాపత్రాలు పొందిన విద్యార్థులు ; కోడూరులో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న గ్రంథాలయ అధికారి పుష్పలత

వయోజన విద్య ఉప సంచాలకుడు హాజీబేగ్

మచిలీపట్నంటౌన్: విజ్ఞానం పెంపునకు గ్రంథాలయాలు దోహదం చేస్తాయని, విద్యార్థులు గ్రంథాలయాల్లోని పుస్తకాలు చదివి విజ్ఞానం పొందాలని వయోజన విద్య జిల్లా ఉప సంచాలకులు హాజీబేగ్ అన్నారు. గత 34 రోజుల పాటు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరం ఆదివారంతో ముగిసింది. విద్యార్థులకు పలు అంశాలపై జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు నగరంలోని పలు శాఖా గ్రంథాలయాల్లో శిక్షణ ఇచ్చారు. ముగింపు సమావేశం ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన హాజీబేగ్ మాట్లాడుతూ గ్రంథాలయాలను సందర్శించడాన్ని విద్యార్థులు అలవాటు చేసుకోవాలన్నారు. వేసవిలో విజ్ఞాన శిబిరం పేరుతో విద్యార్థులను గ్రంథాలయాలకు రాబట్టేందుకు పలు అంశాల్లో శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. అనంతరం పలు పోటీల్లో ప్రతిభ చూపిన 55 మంది విద్యార్థులకు హాజీబేగ్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వేములపల్లి రవికుమార్ ప్రశంసాపత్రాలు, బహుమతులను అందజేశారు. విశ్రాంత ఎంఈఓ రాజేంద్రప్రసాద్, రిటైర్డ్ ఉపాధ్యాయులు సాంబశివరావు, శాస్త్రి, ఉప గ్రంథాలయాధికారి ఎంవీడీటీ నగేష్, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీహాల్‌లో...

నగరంలోని ఈడేపల్లి శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు సమావేశం ఆదివారం రోటరీహాల్‌లో నిర్వహించారు. పలు అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు, బహుమతులను అందజేశారు. కార్యక్రమాన్ని గ్రంథాలయ పాలకురాలు వెంకటేశ్వరమ్మ పర్యవేక్షించారు. చిలకలపూడి శాఖా గ్రంథాలయంలో చిన్నారులకు గ్రంథాలయ పాలకుడు సుబ్రహ్మణ్యం ప్రశంసాపత్రాలు, బహుమతులను విద్యార్థులకు అందజేశారు.

ముగిసిన విజ్ఞాన శిబిరం..

మోపిదేవి: విద్యార్థి దశ నుంచే పోటీ పరీక్షల్లో పాల్గొనాలని మోపిదేవి జెడ్పీ పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కంఠంనేని కుటుంబరావు అన్నారు. రావివారిపాలెం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బొందలపాటి సుబ్బారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ పాలకుడు కె. సుధీర్ కుమార్, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

నిత్య పఠనంతో విజ్ఞానం..

పెడన: నిత్యపఠనం ద్వారా విజ్ఞానం పెరుగుతుందని, విద్యార్థులు నిత్య పఠనాన్ని అలవరచుకోవాలని పెడన ఇన్‌చార్జి ఎంఈఓ కేఎస్‌వీ ప్రసాద్ అన్నారు. ఆదివారం పెడన శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. విద్యార్థులు ఎప్పుడూ గ్రంథాలయాలను సందర్శిస్తూ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కొల్లాటి లక్ష్మిని, శిబిరంలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ రౌతుల ప్రసాద్, విశ్వభారతి హైస్కూల్ ప్రిన్సిపాల్ ఏవీ గౌరీప్రసాద్, కాగిత సాంబశివరావు, దిలీప్‌కుమార్, పేరక రవికుమార్, గ్రంథాలయ అధికారి బసవేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోడూరులో..

కోడూరు: వేసవి సెలవులను పురస్కరించుకొని గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. సోమవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్న నేపథ్యంలో తరగతులు ముగిశాయని గ్రంథాలయ అధికారి పుష్పలత తెలిపారు. నెల రోజుల నుంచి విద్యార్థులకు సృజనాత్మక అంశాలు, కథలు చదవడం, సంప్రదాయ ఆటల పోటీలు నిర్వహించారు. 'చదవడం మాకిష్టం' అనే అంశంపై పోటీ నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కోడూరు మెయిన్ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. హెచ్‌ఎం కాశీభొట్ల నాగభూషణం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మంత్రి జోగి రమేష్ ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందిస్తున్న నాయకులు

గూడూరు: గూడూరు మండలం మల్లవోలులో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయి నిరాశ్రయులైన బాధితులకు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ ఆపన్న హస్తం అందించారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా సంభవించిన ప్రమాదంలో గ్రామానికి చెందిన షేక్ జమీలున్నీసా, షేక్ రఖీబ్, షేక్ హమీదున్నిసా ఇళ్లు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. స్థానిక నాయకులతో మాట్లాడి ప్రమాదంపై విచారం వ్యక్తం చేసిన మంత్రి తక్షణ సహాయం కింద ఒక్కో కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయంతో పాటుగా 25 కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులు, వంట సామగ్రిని పంపించారు. మంత్రి ఆదేశాలతో ఆదివారం గ్రామానికి వచ్చిన ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, ఆర్బీకే చైర్మన్ పర్లం పెదబాబు, మోటేపల్లి రత్నారావు, నాయకులు తలుపుల వెంకట కృష్ణారావు. సర్పంచి బొర్రా సాంబశివయ్యలు బాధితులకు మంత్రి పంపించిన సహాయాన్ని అందజేశారు. వీరితో పాటుగా గడ్డివామి దగ్ధమైన మాదపాటి వెంకటేశ్వరరావుకు రూ.10వేల ఆర్థిక సహాయం అందించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందిస్తున్న సర్పంచి సులోచనారాణి

గూడూరు: విద్యార్థులకు వేసవి సెలవులను పురస్కరించుకుని గూడూరు శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు సర్పంచి లింగం సులోచనారాణి ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచి సులోచనా రాణి మాట్లాడుతూ మే 8 నుంచి ప్రారంభమైన వేసవి విజ్ఞాన శిబిరంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు క్రమం తప్పకుండా పాల్గొని సద్వినియోగించుకోవడం అభినందనీయమన్నారు. విద్యార్థులను ప్రోత్సాహించేందుకు గ్రంథాలయ శాఖ పలు పోటీలు నిర్వహించడం, విజేతలకు బహుమతులు ప్రదానం చేయడంతో చిన్నారులు మరింత పట్టుదలతో హాజరయ్యారని చెప్పారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతకు పదును పెట్టే విధంగా విజ్ఞాన శిబిరాలు నిర్వహించిన గ్రంథాలయ అధికారులను అభినందించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ వై.శ్రీనివాసరావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి వనరులు మెరుగుపర్చేందుకు చర్యలు



పూడికతీత ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీ

గన్నవరం: గన్నవరంలో పెరుగుతున్న గ్రామ జనాభా అవసరాలకు అనుగుణంగా నీటి వనరులను మెరుగు పర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ పేర్కొన్నారు. స్థానిక టాటా స్టీల్ యార్డు సమీపంలోని పానకాల చెరువులో చేపట్టిన పూడికతీత పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గన్నవరం గ్రామంలో పెరుగుతున్న అపార్టుమెంట్లు, భవన నిర్మాణాలతో వేగంగా విస్తరిస్తోందన్నారు. అందుకు తగ్గట్లుగా బోర్‌వెల్స్ ద్వారా నీటి సరఫరా చేయడం గ్రామ పంచాయతీకి విద్యుత్ బిల్లులు భారంగా మారిందని చెప్పారు. పెరిగిన తాగునీటి అవసరాలను తీర్చేందుకు పానకాల చెరువులో పూడికలు తొలగించి పోలవరం నీటితో నింపుతామన్నారు. పూడికలు తీసిన మట్టిని గన్నవరంతో పాటు పరిసరా గ్రామాల ప్రజలు, జగనన్న లేఅవుట్ లబ్ధిదారులు ఇళ్ల మెరక, ఇతర అవసరాలకు ఉపయోగించుకోవాలని కోరారు. స్థానిక తొండగుంట, ఊర చెరువుల్లో కూడా పూడికలు తొలగించి మర్ల చెరువు ద్వారా పోలవరం నీటిని తరలించి తాగునీటి అవసరాలకు వినియోగించే విధంగా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పానకాల చెరువులో సాగు పట్టాలు పొందిన లబ్ధిదారులకు ప్రత్యామ్నాయ భూములు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్‌రాణి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కాసరనేని గోపాలరావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, వైస్ ఎంపీపీ కొమ్మురాజు సుధీర్, మాజీ వైస్ ఎంపీపీ గొంది పరందామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలుల బీభత్సం



కొక్కిలిగడ్డ ఎస్సీ ఏరియాలో రమాదేవి పూరింటిపై పడిన తాటి చెట్టు

మోపిదేవి: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం అర్ధరాత్రి ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. ప్రధాన రహదారులతో పాటు గృహాల వద్ద చెట్లు నేలకొరిగాయి. వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. కొక్కిలిగడ్డ ఎస్సీ ఏరియాలో చాటి రమాదేవి ఉంటున్న పూరిపాకపై తాటి చెట్టు పడింది. ఆమె బయటకు పరుగుతీయడంతో పెనుప్రమాదం తప్పింది. కృష్ణా కరకట్టపై రహదారికి అడ్డుగా పడిన చెట్లను ఆర్బీ అధికారులతో పాటు కొక్కిలిగడ్డ సర్పంచ్ దిడ్ల జానకీ రాంబాబు సహకారంతో చెట్లను తొలగించారు. గత కొన్ని రోజులుగా వడగాడ్పులకు ఉక్కిరి బిక్కిరి అవుతున్న ప్రజలకు ఈ వర్షం కొంత ఊరటను కల్పించింది.

సీతారామ స్వామి వార్లకు జలాభిషేకం



పెనమలూరు: మండలంలోని యనమలకుదురు గ్రామం సంజీవయ్యనగర్‌లో వేంచేసిన శ్రీ లక్ష్మణ, హనుమత్ శ్రీసీతారామస్వామివార్ల నూతన విగ్రహాల ప్రతిష్ఠ సందర్భంగా ఆదివారం స్వామివార్ల విగ్రహాలకు జలాభిషేకం చేశారు. ఉదయం స్వామి వర్లకు విశ్వక్సేన పూజ, 108 మంది మహిళలతో స్వామివార్లకు జలాభిషేకం నిర్వహించారు. అనంతరం హోమం, గ్రామోత్సవం ఘనంగా జరిగాయి. సోమవారం ఉదయం 7.28 గంటలకు శ్రీలక్ష్మణ్ హనుమత్ శ్రీసీతారామస్వామివార్ల నూతన శిలా విగ్రహాల ప్రతిష్ఠ, శాంతికల్యాణం జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది. భక్తులకు ఉదయం 11 గంటలకు అన్నసమారాధన చేస్తామని కార్యక్రమం ఉంటుందని పేర్కొంది.

భక్తులకు మజ్జిగ పంపిణీ



మోపిదేవి: మోపిదేవి వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దర్శనార్థం విచ్చేసిన భక్తులకు అవనిగడ్డకు చెందిన మత్తి హరిశంకర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఆదివారం ఆలయానికి పెద్దఎత్తున భక్తులు తరలి రావడంతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు చల్లని మజ్జిగ అందజేశారు. కామిశెట్టి శ్రీనివాసరావు, కాంతారావు, తోట బ్రహ్మణి, బి.వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటీరియర్ వర్క్ పేరిట మోసం

పెనమలూరు: నూతన భవనంలో ఇంటీరియర్ వర్క్ చేస్తానని రూ.25 లక్షలు తీసుకుని మోసగించిన మహిళపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. సీఐ ఎం.కిషోర్‌బాబు కథనం మేరకు.. కానూరులో గేటెడ్ కమ్యూనిటీలో ఫ్లాట్ నంబర్ 302ను డాక్టర్ జైయోస్నా, డాక్టర్ సంజయ్ సాల్మన్‌రాజ్ కొనుగోలు చేశారు.
ఫ్లాట్‌లో ఇంటీరియర్ డిజైన్ వర్క్ చేసేందుకు రూ.35 లక్షలకు ఎస్‌ఆర్‌కే ఇన్నోవేటివ్ ఇంటీరియర్స్ యజమాని కళారాణి ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆమె మాటలు నమ్మిన జైయోస్నా, డాక్టర్ సంజయ్ సాల్మన్‌రాజ్ పలు దఫాలుగా రూ.25 లక్షలు ఆమెకు ఇచ్చారు.
అయితే కళారాణి నాణ్యత లేని పనులు చేయడమే కాకుండా సకాలంలో పూర్తి చేయలేదు. ఆమెకు జైయోస్నా, డాక్టర్ సంజయ్ సాల్మన్‌రాజ్ ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. గత ఫిబ్రవరిలో కొందరు వ్యక్తులతో కళారాణి వచ్చి తాను ఇక పనులు చేయబోనంటూ జైయోస్నా, డాక్టర్ సంజయ్ సాల్మన్‌రాజ్‌ను బెదిరించింది. కళారాణి ఒప్పుకున్న వర్క్‌ను చేయకపోవడంతో తమను నమ్మించి మోసం చేసి సొమ్ము తీసుకుందని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

కంకిపాడు: ఐదుగురు జూదరులను కంకిపాడు పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ కె.సుధాకర్ కథనం మేరకు.. మండలంలోని ఈడుపుగల్లు గ్రామంలోని పంట పొలాల్లో పేకాట శిబిరం నిర్వహిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఆ ప్రాంతంపై దాడి చేయగా ఐదుగురు జూదరులు పట్టుబడ్డారు. వారి నుంచి రూ.1010 నగదు స్వాధీనం చేసుకున్నారు. జూదరులను అరెస్టు చేసి వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

క్రికెట్ కిట్ అందజేత

అవనిగడ్డ: చల్లపల్లి మండలం చింతలమడకు చెందిన యువకులకు శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాంకిశోర్ నాయుడు క్రికెట్ కిట్ అందజేశారు. స్థానిక సొసైటీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన వీఎంఆర్ పవర్ హిట్టర్స్ క్రికెట్ టీంకు క్రికెట్ కిట్‌ని అందించారు. క్రీడాకారులు పవన్, పెన్నేరు వాసు పాల్గొన్నారు.